వేసవి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ



భీమడోలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కనమాల రామయ్య, అధికారులు

భీమడోలు: వేసవిలో గ్రామంలో మంచినీటి, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు ప్రగతి, వివిధ శాఖల అభివృద్ధిపై ఆయన సమీక్షించారు. సభ్యులు, సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను సభలో లేవనెత్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ కనమాల రామయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతిప్రజానిధులు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లిన ప్రతి సమస్యలను పరిష్కారించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అధికారులు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలన్నారు. వచ్చే వేసవిలో కొల్లేరు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించి మండలానికి జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకుని రావాలన్నారు. మండలానికి వారం రోజుల్లో 1206 కొత్తగా గృహాలు మంజూరు కానున్నాయన్నారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి వచ్చే అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి నివేదికలను మూడు రోజుల ముందుగానే తమకు అందజేయాలని సూచించారు. ఏఓ రామస్వామి మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యాలయంలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించామన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు చొరవతో భీమడోలు బీసీ కాలనీలో మంచి నీటి బోరుకు అవసరమైన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనితో పాటు పోలసానిపల్లి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు.

ఎంపీటీసీ సభ్యుడు ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ భీమడోలులోని జగనన్న కాలనీ తరహాలోనే వైఎస్సార్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వారికి విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించాలన్నారు. దుద్దేపూడి సర్పంచ్ నీలం శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండేళ్లుగా గ్రామంలో విద్యుత్ అంతరాయాల పరిష్కారానికి ప్రత్యేక టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారులు చెప్పినా నేటికి ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. భీమడోలు వైస్ ఎంపీపీ డోకల వాసంతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకున్నా వారికి బిల్లుల నగదు జమ కాలేదని, వారికి బిల్లుల మొత్తం జమ అయ్యేలా ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు ఆజామ్ మాట్లాడుతూ అంబర్‌పేట గ్రామంలో ముస్లింలకు శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలన్నారు. ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ సార్వాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నగదు రూ.50 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రభుత్వం రికార్డుస్థాయిలో వారికి నగదు జమ చేసిందన్నారు. ఐసీడీఎస్ పీఓ కేవీ విజయలక్ష్మీ మాట్లాడుతూ డిసెంబర్ నాటికి అంగన్‌వాడీలకు సంబంధించి భవనాల అద్దెలను చెల్లించామన్నారు.

మండల పరిషత్ బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: శాఖాపరమైన సమస్యల పరిష్కారంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ భానుశ్రీ, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ వి.శ్రీలత మాట్లాడుతూ 2024–25 ఎంజీఎన్ఆర్ఈజీఎస్ బడ్జెట్, బీపీడీపీ 2024–25 బడ్జెట్‌ను చదివి వినిపించారు. దీనికి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, తహసీల్దార్ వి.జితేంద్ర, ఏఓ భీమరాజు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీఆర్‌ఓలు ఉన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, తహసీల్దార్ జి.వరహాలయ్య, ఎంపీటీసీ సభ్యులు అంబటి దేవి, గంటా శ్రీనివాసరావు, విజయభాను, పొల్నాటి శ్రీను పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న కాలనీ స్థలాల రిజిస్ట్రేషన్



చొదిమెళ్ల సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న లబ్ధిదారులు

ఏలూరు రూరల్: ఏలూరు నగరం, ఏలూరు రూరల్ గ్రామాల్లోని జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చురుగ్గా సాగుతోంది. బుధవారం లబ్ధిదారులు గ్రామ సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రెండురోజుల క్రితం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించడంతో పేదల్లో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్వో లాగిన్ ద్వారా ఏపీ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ తెరిచి లబ్ధిదారు పేరు, వేలిముద్రతో పాటు పట్టా నెంబర్ ఎంటర్ చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమౌతోంది. సచివాలయ అడ్మిన్ వేలిముద్రతో రిజిస్ట్రేషన్ ముగుస్తుంది. ఈ మొత్తం వ్యవహారం మూడు నుంచి ఐదు నిమిషాల వ్యవధిలో పూర్తవుతుంది.

మద్యం విక్రేత అరెస్ట్

ఏలూరు టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు శివారు సత్రంపాడుకు చెందిన భాగ్యరాజు సత్రంపాడు కూడలిలో బుధవారం రాత్రి మద్యం అమ్ముతుండగా త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత



ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న సర్పంచ్ నాగమల్లేశ్వరి కుమార్

దెందులూరు: ఆరోగ్యశ్రీ వైద్యసేవల పరిధిని రూ.25లక్షల వరకు పెంచి కార్పొరేట్ వైద్యాన్ని పేదల ముంగిటకు తీసుకొచ్చిన గొప్ప సంస్కరణవాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. బుధవారం గోపన్నపాలెం గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు ఆమె నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్టానీష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మోర్ల సుబ్బారావు, మోర్ల పద్దయ్య, కృష్ణ, ఉన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ల తనిఖీ



సచివాలయంలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లను తనిఖీ చేస్తున్న వీఆర్‌ఓ అనిరుధ్

దెందులూరు: మండలంలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. బుధవారం లబ్ధిదారులకు దెందులూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వీఆర్‌ఓ అనిరుధ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన గ్రామ సచివాలయాలకు వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని కోరారు.

16 నుంచి అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు



గాలాయగూడెంలో ముఖద్వార సెట్టింగ్

దెందులూరు : కొర్కెలుతీర్చే కల్పవల్లిగా సంతాన లక్ష్మిగా పేరుపొందిన దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవ మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ పేర్కొంది. ముఖ ద్వారం, భారీ సెట్టింగులు, విద్యుదీపాలంకరణల్లో ఆలయం వద్ద కటౌట్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మంచినీరు, మౌలిక వసతులు కల్పించినట్టు ఆలయ కమిటీ పేర్కొంది.

మేరీమాత ఆలయ అభివృద్ధికి కృషి



జెడ్పీటీసీ లీలా నవకాంతాన్ని సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

దెందులూరు: మండలంలోని దోసపాడు మేరీమాత ఆలయ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. బుధవారం ఆమె దోసపాడు మేరీమాత ఉత్సవాల్లో పాల్గొని, పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్, ఉత్సవాల నిర్వాహకులు పి.డేవిడ్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ పెద్దలు మేరీమాత ఆలయం వద్ద లీలానవకాంతాన్ని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

భూముల రీ సర్వేపై ఆరా



రీసర్వే విధానంపై ఆరా తీస్తున్న ట్రైనీ కలెక్టరు

పెదపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టరు భావన బుధవారం సందర్శించారు. మండలంలోని భూముల రీసర్వే విధానాన్ని మండల సర్వేయరు కోదండరామ్, గ్రామ సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్లు కుమార్, ప్రమోద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

పెదవేగి : స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో వినియోగదారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో పెదవేగి ఏడీ పి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై సమావేశం

దెందులూరు: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం మండల విద్యుత్ సబ్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు ఏలూరు సెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీజీ నటరాజన్ తెలిపారు. విద్యుత్ సిబ్బంది, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొంటారని, రైతులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పథకాల వినియోగంపై అవగాహన



వసంతవాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దాసరి సుమలత

పెదపాడు : యువత ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని ఏపీఎం దాసరి సుమలత అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో సంక్షేమ పథకాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుమలత మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత లబ్ధితో కొంతమంది డ్వాక్రా మహిళలు పచ్చళ్ల తయారీ, కిరాణా, పాల వ్యాపారం, గేదెల పెంపకం వంటివి చేస్తున్నారని వివరించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా చేపట్టే పచ్చళ్ల తయారీ, స్వీట్లు తయారీ, టెంట్‌హౌస్, సౌండ్‌సిస్టమ్ వంటివి వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, గేదెల పెంపకం పథకాలు కూడా ఉన్నాయని, వాటికోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రుణాలు పొందిన వారికి రూ.30 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ, సంబంగి శ్రావణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో యువత వివిధ యూనిట్లు స్థాపించేలా చర్యలు చేపడతామని ముక్కు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీసీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చింతల ఆనంద్ గంగాడ వెంకట్రావు పాల్గొన్నారు.

చెరువు శుభ్రతకు చర్యలు చేపట్టండి



అధికారులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ప్రసాద్

పెదపాడు : మంచినీటి చెరువును శుభ్రపరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ అధికారులను కోరారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు స్థానికుడు ముక్కు సత్యనారాయణ, వసంతవాడ గ్రామంలో ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ పర్యటించారు. మంచినీటి చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, నాచు, తూడును తొలగించాలని కోరడంతో, సమస్య పరిష్కారానికి తగు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ప్రసాద్ సూచించారు. పశువుల ఆసుపత్రి వద్ద బోర్‌వెల్ గ్రామస్తులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. పశువుల ఆసుపత్రి వద్ద ఖాళీగా ఉన్న స్థల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. స్థానిక నాయకులు భావరాజు సత్యనారాయణ, సంబంగి శ్రావణ్‌కుమార్‌లతో గ్రామాభివృద్ధిపై చర్చించి పనులు చేపడతామని స్థానిక పెద్దలు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.తేజరతన్, తహసీల్దార్ భావన్నారాయణ, ఆర్‌ఐ బలుసు గీతిక, చింతల ఆనంద్, గొంగాడ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఆరోగ్య పథకాలు



భీమడోలులో డీవార్మింగ్ డే వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఆరోగ్య పథకాలు అమలు చేస్తూ దేశస్థాయిలో అగ్రగామిగా నిలిచిందని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డీ-వార్మింగ్ డే వాల్‌పోస్టర్లును ఎంపీపీతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్న పిల్లల నుంచి పెద్దల ఆరోగ్యం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఆరోగ్య శ్రీ, జగనన్న ఆరోగ్య సురక్షా పథకం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వంటి బృహత్తర కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా 2 నుంచి 19 ఏళ్ల వరకు చిన్నారులు, యువతకు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఏకైక లక్ష్యంగా నులిపురుగుల నివారణ మాత్రలను అందిస్తున్నారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 9427 మందికి మాత్రలు వేస్తారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, వైస్ ఎంపీపీ డోకల వాసంతి, ఎంపీడీఓ టి.స్వర్ణలత, తహసీల్దార్ జి.వరహాలయ్య, ఎంఈఓలు ఈ.శ్రీనివాసరావు, ఏ.భాస్కర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దొమ్మర్లకు గుర్తింపు



సమావేశంలో పాల్గొన్న ఈడా చైర్మన్ శ్రీనివాస్, పార్టీ నగర బీసీ సెల్ అధ్యక్షుడు రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత దక్కిందని ఏలూరు నగరంలోని దొమ్మర సంఘీయులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్ఆర్‌పేటలో దొమ్మర సామాజిక వర్గీయుల ఆత్మీయ సమావేశం ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా దొమ్మర సామాజిక వర్గం అధ్యక్షులు మస్తాన్‌రావు, కాళిదాసు దుర్గారావులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల నాని వచ్చిన తర్వాతే తమకు మార్కెట్ డైరెక్టర్ పదవి ఇచ్చి గుర్తించారని తెలిపారు. పూర్వం కుల సర్టిఫికెట్, రేషన్ కార్డుల కోసం అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని చెప్పారు. తాము పెద్దపెద్ద చదువులు చదువుకోవడానికి కారకులైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇడా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీలకు అనేక వాగ్దానాలిచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. జన్మభూమి కమిటీల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని, డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చేయలేదని, పెన్షన్లు సక్రమంగా అర్హులకు ఇవ్వలేదని గుర్తుచేశారు. బీసీలంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరిగి పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు రాజగోపాలాచారి మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరిగిందంటే ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనేనని వివరించారు. ఎమ్మెల్యే నాని బీసీలకు అత్యధిక పదవులు కట్టబెట్టి, బీసీల పక్షపాతిగా పేరుగాంచారని చెప్పారు. ఏలూరు ఎంపీ సీటు బీసీ అయిన కారుమూరి సునీల్‌కి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి నానిలకు మద్దతు ఇవ్వాలని కోరారు. దొమ్మర సామాజిక వర్గం నాయకులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



భోగాపురంలో బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పెదవేగి : ఆటపాటలతో విద్యార్థుల్లోని ప్రతిభ బయటకొస్తుందని భోగాపురం హెచ్‌ఎం వీఎస్‌వీ లక్ష్మీ అన్నారు. పెదవేగి మండలం భోగాపురం, కొప్పాక గ్రామాల్లోని హైస్కూళ్లలో 120 మంది బాల బాలికలకు చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో బాలమేళా పేరుతో ఫన్నీ గేమ్స్, బెలూన్ గేమ్, లక్ సర్కిల్, న్యూమరికల్ గేమ్, గ్లాస్ అండ్ వాటర్, బాలన్ సర్కిల్ ఆటల పోటీలు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్నవారికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ బి.కనకదుర్గ, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు, సీఆర్ఎఫ్ బి.జ్ఞానశ్రీ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ.90 లక్షల మంజూరు

భీమడోలు: రోడ్డు నిర్మాణం, మరమ్మత్తులకు రూ.90లక్షల నిధులు మంజూరయ్యాయని భీమడోలు ఆర్ అండ్ బీ ఏఈఈ జే.భాస్కరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. భీమడోలు జంక్షన్ నుంచి భీమడోలు రైల్వే గేటు వరకు మరమ్మత్తుల కింద రూ.10 లక్షల మంజూరయ్యాయన్నారు. వాటికి సంబంధించిన ఈనెల 9న టెండర్లు ఖరారు కానున్నాయన్నారు. అదే విధంగా భువనపల్లి నుంచి అడవికొలను, చెట్టున్నపాడు నుంచి మల్లవరం వరకు ఉన్న రహదారుల నిర్మాణానికి ఒకే ప్యాకేజీ కింద రూ.3 కోట్లు మంజూరయ్యాన్నారు. ప్యాకేజీలోని రూ.3 కోట్ల నిధుల్లో భాగంగా చెట్టున్నపాడు నుంచి మల్లవరంకు రెండు కిలోమీటర్ల మేర రూ.80 లక్షలతో కొత్త రోడ్డును నిర్మిస్తామన్నారు.

సీఎం జగన్ మానవత్వానికి నిలువెత్తు రూపం



ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కు అందుకుంటున్న దృశ్యం

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వానికి నిలువెత్తు రూపమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఈ నెల 3న దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న సిద్ధం బహిరంగ సభకు కొత్త అంబర్‌పేటకు చెందిన తన కుమార్తు సాయికిరణ్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని ఆర్థిక సాయం చేయాలని కోరుతూ తండ్రి కె.నాగరాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అర్జీ పెట్టుకుని తమ బాధను వివరించారు. తమ 11 ఏళ్ల కుమార్తు సాయికిరణ్ మెదడుకు చెందిన వ్యాధితో బాధపడుతున్నాడని, నిరుపేద కుటుంబానికి చెందిన తాను బిడ్డకు రక్షించుకునేందుకు ఆర్థిక సాయం చేయాలని కోరాడు. దీనితో బిడ్డను చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించి తక్షణమే అతని కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తున్నట్లు ప్రకటించారు. మరుసటి రోజైన 4న సంబంధిత ఉన్నతాధికారులు అతనికి లక్ష రూపాయలను చెక్కును అందించారు. ఆ చెక్కును ఉంగుటూరు వాసుబాబు చేతుల మీదుగా నాగరాజు, సాయికిరణ్‌లకు అందించారని, వైఎస్సార్‌సీపీ నేతలు ఏపూరి రాంబాబు, రామిశెట్టి శ్రీనివాసరావు, పిచ్చెట్టి నాగు, ఎంపీటీసీలు సయ్యద్ ఆజామ్, దాసరి విజయభానులు బుధవారం తెలిపారు.

మెప్మా సహకారంతో బ్యాగుల తయారీ



మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాగుల తయారీ స్క్రీన్ ప్రింటింగ్ షాపు



షాపును ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు గుడూరి ప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు పట్టణ పేదల నిర్మూలన సంస్థ (మెప్మా) సహకారంతో సీఆర్ఆర్ కళాశాల ప్రాంతంలో ఏర్పాటుచేసిన పట్టణ ప్రగతి యూనిట్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు గుడూరి ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ మహిళల సుస్థిర జీవనోపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేలా స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చి, వారిలో నైపుణ్యలను మెరుగుపరుస్తూ జీవనోపాధి పొందేలా చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కె.సుధాకరరావు, డీపీఎంయూ దీప, మెప్మా సిబ్బంది ఉన్నారు.


ఆర్చరీ చాంపియన్ యుక్తశ్రీకి అభినందన



ఆర్చరీ చాంపియన్ యుక్తశ్రీని అభినందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

దెందులూరు: యుక్తశ్రీ ఆర్చరీలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన 40వ సబ్ జూనియర్ నేషనల్ ఆర్చరీ (విలువిద్య) చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు గోల్డ్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించిన దెందులూరు నియోజకవర్గానికి చెందిన కొండపావులూరి యుక్తశ్రీ బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిశారు. యుక్తశ్రీ సాధించిన విజయాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సీఎంకు వివరించారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారాన్ని అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ఉన్నారు.

చిన్నారులకు టీకాలు



పెదవేగిలో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పెదవేగి : చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు టీకాలు దోహదపడతాయని ఏఎన్ఎం జి.మౌనిక అన్నారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పెదవేగి, తదితర గ్రామాల్లో బుధవారం ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు, గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీటీ ఇంజక్షన్లు చేశారు. పెదవేగి అంగన్‌వాడీ కేంద్రంలో మౌనిక మాట్లాడుతూ చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, మల్లిక, ఆశా కార్యకర్తలు తులసి, వల్లి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వలిలో సంబరాలు

దెందులూరు: వైఎస్సార్ సీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే, కొవ్వలికి చెందిన గొల్ల బాబూరావును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభ సభ్యునిగా పోటీకి ఎంపిక చేయడంతో బుధవారం కొవ్వలిలో సంబరాలు చేసుకున్నారు. బాబురావు కుటుంబ సభ్యులు స్వీట్లు పంచారు. బాబూరావు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కమిషనర్‌గా, మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన విషయం విధితమే.

జేసీబీ దగ్ధం

ఏలూరు టౌన్: ఏలూరు బీడీ కాలనీలో రోడ్డు పక్కన నిలుపుదల చేసిన జేసీబీ వాహనం బుధవారం తెల్లవారుజామున దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

శ్రీ చందా సత్రం

దేవదాయ - ధర్మదాయ శాఖ, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా

భూమి కవులు హక్కునకు టెండర్ కం బహిరంగ వేలము ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగరములో ఉన్న శ్రీ చందా సత్రము యొక్క పూర్తి హక్కుభుక్తమైనటువంటి పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం, వాకపల్లి గ్రామం నందు య.6-09 సెంట్లు పల్లపు భూమి సేద్యము చేసుకొనే అనుభవించే హక్కును గూర్చి, శ్రీ యుత ప్రాంతీయ సంయుక్త కమీషనరు, దేవదాయ-ధర్మదాయ శాఖ, మల్టీ జోన్-1 రాజమహేంద్రవరం వారి అమోదపు ఉత్తర్వులకు లోబడి కౌలు హక్కులకు గాను 3 సంవత్సరములకు ది.19-02-2024 సోమవారం ఉదయం.11 గంటలకు వాకపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద తనిఖీదారు, దేవదాయ ధర్మదాయ శాఖ, తాడేపల్లిగూడెం వారి సమక్షమున టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించబడును.కావున ఆశక్తిగలవారు పాల్గొనవలసినదిగా తెలియపరచడమైనది.

టెండర్ కం బహిరంగ వేలము పాట ప్రకటన వివరములు

వ. నెం.	ఆర్.యస్.నెం	భూమి విస్తీర్ణం య.సెం	భూమి స్వరూపం	పాట ధరావత్తు రూ.పై	సాల్వేన్సీ సర్టిఫికెట్ విలువ	కాల పరిమితి	
1	68/1	2.83	పల్లం	10,000/-	2,00,000/-	2024-25 నుండి 2026-27 వరకు	3 సం.లు
2	82/2	3.26	పల్లం	10,000/-	2,00,000/-		

పి.యస్.కె.రామశర్మ,
చైర్మన్

కార్యనిర్వహణాధికారి గ్రేడ్ -1
9700510457